కవితా కౌముది

# జాగృతి

బండి అనూరాధ

కర్పూర హారతుల్లో పడి
నిన్ను నువ్వు ఆహుతి చేసుకుంటున్నావ్
సాంబ్రాణీ పొగల్లో నీ కలల్ని
కుళ్ళబొడుచుకుంటున్నావ్

ఓ మగువా,
వగల ధూపాలు వల్లెవేసేవేం ఉండవ్
నిన్ను నువ్వు కలిగించుకోవడం ఆపేయ్
నిజానికి రా..నువ్వు పూజావస్తువువి కాకు
నువ్వు పూజింపబడని ఎచ్చోటా
నిలచి పూజలు చెయ్యకు

ఇదిగో నన్ను విను
నిన్ను బంధించిన
నీ ఈ చుట్టూ ఉన్న
సమాజాన్ని దీర్ఘనిద్రపుచ్చు
ఓ నిజ మెలకువానంతరమైనా
కళ్ళు తెరచి నిను పూజిస్తుందేమో
నిన్ను వాడుకోవడం మానేస్తుందేమో

ఇదుగో నువ్వు అణచబడుతున్న చోట
నువ్వెప్పటికీ నవ్వలేవు
నీ ఏ పూజా నీకు ఫలితాన్ని ఇవ్వదు

అసహజ పరిమళాల్లో అనంతముందని
నీ ఒక శూన్య భ్రమను ఇప్పుడిక్కడ
అంటించి.. అసందర్భమవకు

ఒక నువ్వు కొలవబడేవరకూ
నువ్వు కొలత వెయ్యడం మానెయ్యి

ఇక ఇప్పటికైతే,
మబ్బు పట్టిన విశాల జగతికి
ఒక గొడుగు కప్పుదాం
మూఢత్వపు జల్లులు కురవకుండా..!!

★★★



# స్ఫూర్తిపథం

రవిప్రసాద్ చెలమల్లు

తెరచిన పుస్తకంలో
గాలికి మారిపోతున్న
పుటలకు మల్లే
జీవితం
రెపరెపలాడుతున్నప్పుడు

సహచరులారా...,

మళ్ళీ ఆ పాత దారుల్లో
మనం కలసి తిరగాలి
పంచుకుని
వసివాడిన విరులకు
ఊపిరిపోస్తూ
ఉత్తేజాన్ని నింపుకోవాలి

మళ్ళీ ఆ పాత దారుల్లో
మనం కలసి తిరగాలి
దారుల వెంట
రువ్వుకున్న రాళ్ళు
ఏరుకుంటూ
రహదారి చేసుకోవాలి



మళ్ళీ ఆ పాత దారుల్లో
మనం కలసి తిరగాలి
ఇన్నేళ్ళ ప్రయాణం లో
వెలుగులను, చీకట్లను
మోదాన్ని, ఖేదాన్ని
కలిసి సమీక్షించుకోవాలి

వెనక్కు నడుస్తూ ఉంటే
తిరోగమనం అంటారు కానీ,
పురోగమనాన్ని
కొత్త పుంతలు తొక్కించాలంటే
అప్పుడప్పుడూ
వెనక్కు నడుస్తూ వెళ్ళాలి

అడుగులు ముందుకు పడుతున్నా...,
అంతరంగం వెనక్కు నెడుతున్నప్పుడు
చరణాలకు చరిత్ర నాదాలు కొడితేనే
గమనం గాడిన పడుతుంది
స్ఫూర్తిదాయకమవుతుంది..!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

నిదురలోనెంత తీయని ముదము గలదు!
సర్వమును మరచి యెద విశ్రాంతినొందు
అంతరంగపు సరిహద్దులధిగమించి
యోచనలు సేద దీరెడు యోగమద్ది

కలతలనె గాదు మరచు సౌఖ్యముల గూడ
భావభేదములే గాదు బంధములను
ప్రేమనే గాదు విడనాడు ద్వేషములను
బంధములకతీతస్థితి బడయు మనసు

ఇట్టి నిర్వికారస్థితినెటులొ వీడి
జ్ఞానమజ్ఞానముల మధ్య సంచరించి
స్వప్నలోకమ్మునకరిగి స్వాంతమెట్లొ
మరలి వచ్చు నిర్ణీతసమాధి వైపు

తెలియు నిద్దురలోనున్న తీయదనము
స్వప్నలోకానుభవమును పరిచితమ్ము
మెలకువను గూడ కందుము కలలనెన్నొ
కష్టసుఖముల గూర్చి సంతుష్టి గూర్చి

గడపుచుందుము బ్రతుకెల్ల కలలు కనుచు
అందజాలని దివ్యసౌఖ్యముల గూర్చి
అందగల్గెడు మెండు భాగ్యముల గూర్చి
అద్వితీయమద్భుతము స్వప్నానుభవము

COMMENTS